బెస్ట్ ఆఫ్ లక్!



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయినీ సింగంశెట్టి అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల పీఎంసీ చైర్మన్ ఒంగూరి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులందరూ బాగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు. 130 మంది విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో గంగినేని వీరయ్య, టి.వెంకట నర్సయ్య, పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు గంగినేని రాఘవ, గోవిందయ్య, కుమార్, రమేష్, ఉపాధ్యాయులు అంజిరెడ్డి, సీహెచ్. సుభాష్, కిరణ్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

– వినుకొండ(నూజెండ్ల)

ఆల్ ఆర్ హ్యాపీ

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థత గురైన విద్యార్థుల ఆరోగ్యం క్షేమంగా ఉందని రాష్ట్రీయ బాల సురక్ష యోజన అధికారి హనుమా కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అస్వస్థత గురైన 15 మంది విద్యార్థులకు స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. మరో నలుగురు విద్యార్థులను వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కొణతం ఏరుకలరెడ్డి పాల్గొన్నారు.

–శావల్యాపురం



వైభవంగా ఆలయ ప్రతిష్ట



రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయకుడితో పాటు ధ్వజస్తంభం, నవగ్రహ మండపం, విమాన శిఖర ప్రతిష్టా కార్యక్రమాన్ని ఆకళంకం వెంకట రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుస్మితారెడ్డి దంపతులు ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. మహిళలు ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్నారు. పూర్ణాహుతి నిర్వహించారు.

–నరసరావుపేట రూరల్

బైక్ చక్రాలు మాయం

బైక్ చోరీలు జరగడం సర్వ సాధారణం. కానీ ఇంటి ముందు ఉంచిన రెండు బైక్ చక్రాలను గుర్తు తెలియని దుండగులు ఊడదీసుకెళ్లిన సంఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. ఎస్‌బీఐ సమీపంలో నివసించే పోపూరి రాము గురువారం రాత్రి తన ఇంటిముందు వీధిలో బైక్‌ను ఉంచి శుక్రవారం ఉదయం లేచి చూడగా వెనక చక్రం కనిపించలేదు. అదేరోజు రాత్రి గ్రామంలోని హైవే సర్వీసు మార్గంలోని బైక్ మెకానిక్ షేక్ కరిముల్లా రిపేరుకు వచ్చిన బైక్‌లకు ఐరన్ చైన్‌తో చుట్టి తాళం షెడ్డుమూసి ఇంటికెళ్లాడు. తెల్లవారి చూస్తే బయట ఉంచిన వాహనాల గొలుసు ఊడదీసి ఓ బైక్ వెనుక చక్రం కనిపించలేదు. దీంతో వీరిద్దరూ పోలీసులను ఆశ్రయించారు.

–యడ్లపాడు



క్లుప్తంగా

విద్యార్థులకు ఎల్ఐసీ అవార్డులు



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని నాగులవరం గ్రామంలో ఎల్ఐసీ వారి ఆధ్వర్యంలో జడ్పీహెచ్ పాఠశాలలో 2021–22 సంవత్సరానికి సంబంధించి స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను వినుకొండ బ్రాంచి మేనేజర్ లక్ష్మా నాయక్ చేతుల మీదుగా ట్రోఫీలు, ప్రశంసా పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నూనె కోటేశ్వరరావు, హెచ్ఎం శారద, ఏజెంట్స్ ప్రెసిడెంట్ చెరుకూరి హరనాథ్‌బాబు, మద్దుల రమణారెడ్డి, ఏడుకొండలు, దానవరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఉచితంగా పోషకాహారం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం సమయంలో ఉచితంగా పోషకాహారాన్ని అందిస్తున్నట్లు పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో దాతలు, యువకులు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో ఈ కార్యక్రమం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పూర్తయ్యే వరకు ఉచిత పోషకాహర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పాఠశాల అభివృద్ధిలో వివేకానంద పూర్వ విద్యార్థుల కమిటీ సహకారం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత, గ్రామస్తులు సంద్రపాటి చలపతిరావు, రాంపల్లి హనుమంతరావు, ఆలపాటి శివ ఉన్నారు.

భారత్ బచావో సదస్సు జయప్రదం చేయండి

నరసరావుపేట రూరల్: కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన ఆదివారం గుంటూరు సీపీఐ కార్యాలయంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం సీనియర్ సభ్యులు నల్లపాటి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. హిందూ మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలని, హిందూ మతోన్మాదం చేస్తున్న ప్రజలపై దాడులను అరికట్టాలన్నారు. మాట్లాడే హక్కును హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని ఎండకట్టాలని పిలుపునిచ్చారు. దేశంలోని మేధావులు, ప్రజలు, ఆదివాసీలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేసారు.

వేదపాఠశాల ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ వేద పాఠశాల సంస్కృత ఉపాధ్యాయుడు పోలూరి కృష్ణవాసుకీ శ్రీకాంతశర్మ తిరుపతి జాతీయ సంస్కృత విద్యాపీఠం నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. తిరుపతి విద్యాపీఠంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ఎన్.వేణుగోపాల్‌స్వామి నుంచి పట్టాను అందుకున్నారు. ప్రమోద చంద్ర మిస్ర విరచిత శతక కావ్యానం సాహిత్యకం అధ్యయనం అనే అంశంపై శ్రీకాంత్‌శర్మ పట్టా పొందారు. పీహెచ్‌డీ సాధించిన శ్రీకాంత్‌శర్మను వేద పాఠశాల ప్రధానాచార్యులు మారుతీ వెంకట్రామశర్మ, అధ్యాపకులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని వాసవినగర్, కృష్ణమహల్ రోడ్డు, పొట్టి శ్రీరాములు కాంప్లెక్స్, భాస్కర్ థియేటర్ రోడ్డు, గబ్బిటివారి వీధి ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో ముస్లిం కళాశాల షాదీఖానా, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు
- ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించిన ముస్లింలు



ఎమ్మెల్యే బొల్లాను సత్కరిస్తున్న ముస్లింలు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో ముస్లిం మైనార్టీ సోదరుల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వినుకొండ పర్యటన సందర్భంగా వినుకొండకు ముస్లిం కళాశాల ఏర్పాటుకు నిధులు కేటాయించడంపై ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినుకొండలో ముస్లిం సోదరులకు కళాశాలకు 6 ఎకరాలు, రూ.11 కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. షాదీఖానా నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ముస్లింలు అందరూ కలిసికట్టుగా ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను సద్వినియోగించుకోవాలన్నారు. మర్కస్ మసీదు అభివృద్ధికి రూ.15 లక్షలు సొంత నిధులు ఇచ్చామని, అలాగే షాదీఖానాకు మరో రూ.50 లక్షలు సహాయం చేస్తామన్నారు. అలాగే ఆటో నగర్‌కు 10 ఎకరాల స్థలం కేటాయింపుతో పాటు కార్మికులకు షాపులపై హక్కులు కల్పిస్తామన్నారు. ఆక్రమణకు గురైన మసీదుమాన్యం 100 ఎకరాలు ముస్లిం సోదరులకు హక్కులు కల్పించేలా చర్యలు చేపడతామని చెప్పారు.

రానున్న రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నా రు. జగనన్న కాలనీలో ఇళ్ల మంజూరు, ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు, వంటి పథకాలతో పాటు అనేక పథకాలు ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు చెప్పారు. వినుకొండలో ముస్లింలకు కమ్యూనిటీ హాల్ కోసం స్థలం కేటాయించామని చెప్పారు. సత్వరమే అన్ని పనులు చేపట్టి పూర్తి చేస్తామ న్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు, వార్డు కౌన్సిలర్లు, మసీదు ముజావర్లు, మతపెద్దలు పాల్గొన్నారు.

బడుగుల ఉన్నతి ప్రత్తిపాటికి ఇష్టం లేదు

- చేసిన ఆరోపణలు నిరూపించుకోండి
- బహిరంగ చర్చకు సిద్ధం
- మాజీ మంత్రి ప్రత్తిపాటికి వైఎస్సార్ సీపీ నాయకుల సవాల్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ నాయకులు

చిలకలూరిపేట: బడుగులు రాజ్యాధికారం చేయడం ఇష్టం లేకే మాజీ మంత్రి, టీడీపీ నాయకుడు ప్రత్తిపాటి పుల్లారావు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని విమర్శించారు. మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి శుక్రవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ కార్యవర్గం ఏర్పడిన రెండేళ్ల కాలంలో ప్రతిపక్ష టీడీపీ కౌన్సిలర్లు ఏనాడు కౌన్సిల్ సమావేశాల్లో ఎలాంటి అవినీతి ఆరోపణలు చేయడం లేదని స్పష్టం చేశారు. నేడు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మున్సిపాలిటీలో రెండు కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించటం ఆయన అవివేకానికి అద్దం పడుతోందన్నారు. ఆరోపణలు చేయడం సరికాదని, ఆధారాలు చూపాలని కోరారు. ముస్లిం మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన తనపై, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజినిపై చేసిన ఏ ఒక్క ఆరోపణ నిరూపించినా తన పదవికి రాజీనామా చేస్తానని సవాలు విసిరారు. ఈ విషయాలు చర్చించేందుకు మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేసేందుకైనా, బహిరంగ చర్చకైనా తాము సిద్ధంగా ఉన్నామని సవాలు విసిరారు.

గృహాలు పూర్తి చేయకుండా గెస్ట్‌హౌస్

వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొల్లెద్దు చిన్నా మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాల నిర్మాణ పనులు పూర్తి చేయకుండా, తన సొంతానికి గెస్ట్ హౌస్ నిర్మాణం చేయించుకున్న అవినీతి చరిత్ర మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుదని ఆరోపించారు. నీరు–చెట్టు కింద పేదల భూములు కాజేసి మట్టి అమ్ముకున్న ఘనత ప్రత్తిపాటి ఆయన భార్యదని విమర్శించారు. ఎన్నికల్లో ఓడి పోయాక నాలుగేళ్ల పాటు పక్కరాష్ట్రం హైదరాబాద్‌లో వ్యాపారాలు చేసుకుంటూ ప్రజలకు కానరాని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు నేడు జగనన్న కాలనీల్లో అవినీతి జరిగిందంటూ ఆరోపించటం దొంగే దొంగ... దొంగ అని అరిచినట్లు ఉందని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు ఎద్దేవా చేవారు.

రాష్ట్ర 15వ ఆర్థిక సంఘం సభ్యుడు వడితే కోట్యానాయక్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారికి పదవులు రావటం మాజీ మంత్రి ప్రత్తిపాటికి ఏ మాత్రం ఇష్టం లేదని, అందుకే ఆయా వర్గాలపై అసత్య ఆరోపణలకు దిగుతున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్ పాల్గొన్నారు.


భోజన పథకం తనిఖీ చేసిన న్యాయవాదుల సంఘం



వంటకాల రుచిని పరిశీలిస్తున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలు సామ్రాజ్యం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ తీరును వినుకొండ బార్ అసోసియేషన్ సంఘం అధ్యక్షురాలు ఆరె.సామ్రాజ్యం శుక్రవారం పరిశీలించారు. భోజనం వికటించి విద్యార్థుల అస్వస్థతకు గురైన సంఘటనపై న్యాయమూర్తి తౌసిద్ హుస్సేన్ ఆదేశాలు మేరకు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం అమలు జరుగాలని, వంటకాల రుచి స్వయంగా పరిశీలించామని ఆమె వివరించారు. జరిగిన ఘటనపై సమగ్ర వివరాలు సేకరించామన్నారు. నివేదిక న్యాయమూర్తి వివరిస్తామన్నారు. జిల్లా ఆహార భద్రత అధికారి సీహెచ్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరులో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని రుచికరమైన వంటలు వండించి ఆయా పాఠశాల్లోని ఉపాధ్యాయులు ఒకరు తిన్నా తదుపరి విద్యార్థులకు తినేలా పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాలాది శ్రీనివాసరావు, న్యాయవాదుల సంఘం నాయకులు పి.వి. రమణ రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, నాగరాజు, రామాంజినేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రహదారినే ఆక్రమించేశారు!



మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద రోడ్డు పొడవునా తోపుడు బండ్లు పెట్టి వ్యాపారం చేస్తున్న దృశ్యం

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట సత్తెనపల్లిరోడ్డు మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద తోపుడు బండ్ల వ్యాపారులు స్థానిక గృహవాసుల నుంచి ఇళ్లల్లో నుంచి రోడ్డుపైకి వచ్చేందుకు వీలులేకుండా తమ బండ్లు అడ్డంపెట్టి అవరోధం సృష్టిస్తున్నారు. పిల్లలు సైతం స్కూళ్లకు వెళ్లాలంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ రోడ్డు మార్గం నిత్యం ఆర్టీసీ బస్సులు, లారీలు, ఆటోలు, ద్విచక్రవాహనాల రాకపోకలతో ఉంటుంది. చెట్టు వద్ద జ్యూస్, కొబ్బరిబొండాల బండ్లు, కూరగాయలు విక్రయించే తోపుడు బండ్ల వ్యాపారులు తమ బండ్లను రోడ్డు మార్జిన్‌లో వరుసగా నిలబెడుతున్నారు. వారి వద్ద కొనుగోలు చేసేందుకు వచ్చే జనాలతో సగం రోడ్డు మూసుకుపోతోంది. దీంతో ఈ ప్రదేశంలో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. దీంతో పాటు స్థానిక గృహవాసులు, వారి పిల్లలు సైతం ఇళ్లలో నుంచి రోడ్డుపైకి తమ వాహనాలతో వచ్చే అవకాశం లేకుండా చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఇదే పరిస్థితి. ఆ ప్రదేశానికి రోడ్డుకు మరో వైపున ప్రైవేటు కాన్వెంట్ నిర్వహిస్తున్నారు. దానిలో వందలాది మంది పిల్లలు చదువుతున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం పొంచి ఉంది. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు కలుగుచేసి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

ఎక్కడివాడో.. అన్నవరంలో కడతేరాడు!



రొంపిచర్ల: మండలంలోని అన్నవరం గ్రామంలో శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గ్రామ పరిధిలో గల పొలాలకు వెళ్లే వారు రోడ్డు ప్రక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని చూసి గ్రామస్తులకు సమాచారం తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడకు వెళ్లారు. అనంతరం సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సిహెచ్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా నిర్ధారణ చేశారు. మృతుడికి 50 సంవత్సరాల వయస్సు ఉండవచ్చు.

చికిత్సపొందుతూ మృతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు చనిపోయినట్లు యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... చిలకలూరిపేట పట్టణంలోని మారుతీ నగర్ ఎరుకల కాలనీలో నివాసం ఉంటూ కళామందిర్ సెంటర్‌లోని ఓ చికెన్ షాపులో గుమస్తాగా పనిచేస్తున్న దాసరి వెంకటేశ్వర్లు (32) అతని స్నేహితుడు శ్రీనివాసరావుతో కలిసి గతనెల 23న తెల్లవారుజామున బైక్‌పై గుంటూరు బయలుదేరారు. యడ్లపాడు నక్కవాగు సమీపంలోకి రాగానే బైక్ అదుపుతప్పి హైవే డివైడర్‌ను ఢీకొనడంతో బైక్‌తో సహా రోడ్డుపై పడిపోయారు. తీవ్రగాయాలైన వీరిని 108 వాహన సిబ్బంది గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం దాసరి వెంకటేశ్వర్లు మృతి చెందాడు. అతని భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని అతని కుటుంబ సభ్యులు అప్పగించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గుర్రాలచావిడి ప్రాంతానికి చెందిన షేక్ నాగుల్‌మీరా (26) కూలీ పనులు చేస్తూ ఉంటాడు. గత కొంత కాలంగా మద్యానికి బానిసై ఇంట్లో వారిని మద్యం కోసం డబ్బులు అడుగుతూ వేధిస్తున్నాడు. ఈ నెల ఒకటో తేదీ తండ్రి షేక్ గౌస్ భాషాను మద్యం కోసం డబ్బులు అడగగా తండ్రి మందలించటంతో మనస్థానం చెంది ఇంట్లో ఉన్న పురుగుమందును సమీపంలో ఉన్న పొలాల్లో సేవించాడు. అనంతరం తల్లికి ఫోన్ చేసి సమాచారం అందించాడు. బంధువులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నరసరావుపేట టౌన్: చెల్లని చెక్కు కేసులో ఆర్టీసీ డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. అంజయ్య తీర్పు చెప్పారు. ఇస్లాంపేటకు చెందిన షేక్ పెద్ద సైదా వద్ద చిలకలూరిపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న పసుమర్తి ఖాలేషావలి 2016 సంవత్సరంలో రూ.2.50 లక్ష అప్పుగా తీసుకొని చెల్లింపులో భాగంగా చెక్కు అందజేశాడు. ఖాతాలో నగదు లేకపోవటంతో బాధితుడు కోర్టును ఆశ్రయించాడు. నేరం రుజువు కావటంతో నిందితుడికి 6 నెలల జైలు శిక్షతో పాటు ఫిర్యాదుదారుడికి రూ.5 లక్షల రూపాయలు పరిహారం అందజేయాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

మసీదుల అభివృద్ధికి సహకరిస్తా

- గుంటూరురోడ్డు నాయబ్‌బజారు పెద్దమసీదుకు రూ.2లక్షలు అందజేత
- ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డికితో మసీదు పెద్దలు, మాజీ కౌన్సిలర్లు, వార్డు నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని మసీదుల అభివృద్ధికి తవవంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముస్లిం సోదరులకు హామీ ఇచ్చారు. ఈ మేరకు గుంటూరు రోడ్డులోని నాయబ్ బజారు పెద్ద మసీదును సందర్శించి రూ.2 లక్షల తన సొంత నిధులను మసీదు పెద్దలకు అందజేశారు. ముస్లిం సోదరులతో జుమ్మా నమాజ్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి వారినుద్దేశించి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మసీదును సందర్శించిన సమయంలో మసీదు పెద్దలు పలు సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ నెల 23న రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో వేసవికాలంలో మరింత ఎండలు ఎక్కువగా ఉంటాయని, నమాజులకు వచ్చే ముస్లిం సోదరులకు ఇబ్బందులు కలగకుండా త్రీఫేస్ కరెంట్, రేకుల షెడ్డు నిర్మించుకునేందుకు సహాయం కావాలని అడిగారన్నారు. అప్పుడు హామీ ఇచ్చిన మేరకు ఇప్పుడు ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మసీదు నిర్మాణంలో దాదాపు పనులన్నీ పూర్తయ్యాయని, వరవకట్ట జామియా మసీదు కూడా పూర్తికావొచ్చిందన్నారు. బరంపేటలో నూతన మసీదు నిర్మాణానికి భూమి పూజ చేయటం జరిగిందన్నారు. ఈ ఏడాది నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు గన్నవరం విమానాశ్రయం నుంచి వెళ్లేందుకు నూతనంగా ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తమ ప్రభుత్వంలో నియోజకవర్గంలో ముస్లింలకు ఆరామక్షేత్రం కూడా నిర్మించటమైందన్నారు. తొలుత మసీదుకు వచ్చిన ఎమ్మెల్యేకు మూడవ వార్డులోని ముస్లిం సోదరులు, మసీదు కమిటీ పెద్దలు బ్రహ్మరథం పట్టారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆషాభేగం ఖాజావలి, వార్డు ఇన్‌చార్జి సయ్యద్‌ఖాజా, మాజీ కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, షేక్ రెహమాన్, సిలార్, షేక్ సుభాని, మీరావలి, జాఫర్, జిలానిమాలిక్, వార్డ్ నాయకులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు



నరసరావుపేట: బరంపేట సెక్టార్‌లోని క్రిస్టియన్ పాలెం అంగన్వాడీ సెంటర్‌లో తల్లి పిల్లల అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన వయసుకు తగ్గ ఎత్తులేని పిల్లలు, వారి తల్లులతో ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ గౌసియా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలోని పిల్లలకు కోడిగుడ్లుతో మంచి పౌష్టికాహారం ఇచ్చి పిల్లలకు మంచి చదువు నేర్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం మహాలక్ష్మి, ఆశ వర్కర్ కోటేశ్వరమ్మ, డబ్ల్యుడబ్ల్యు పి కల్పనా జయకుమారి, బొమ్ము రాజ్యలక్ష్మి, వై.స్వరూపా రాణి సిహెచ్ లక్ష్మి, పంగులూరి జయమ్మ పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ సామాజిక బాధ్యత



వన్య ప్రాణుల సంరక్షణపై వివరిస్తున్న హెచ్ఎం గురులింగం

నాదెండ్ల: వన్యప్రాణులు సంరక్షణ ప్రతి సామాజిక బాధ్యత అని హెచ్ఎం ఎ గురులింగం అన్నారు. మండలంలోని గణపవరం రాజీవగాంధీ కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. జనవిజ్ఞాన వేదిక, హుస్సేనమ్మ యల్లమందయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు మల్లీశ్వరి, శివకుమారి, ఝాన్సీలక్ష్మీ, వార్డు వలంటీర్ మాణిక్యమ్మ తదితరులున్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



ప్లకార్డులతో మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని ప్రజాసంఘాలు, పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట గ్యాస్‌బండతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఐఎం, అమరావతి రజక ఐక్యవేదిక, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) టీడీపీ, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, గోదా జాన్‌పాల్, నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటల ఆవశ్యకతను రైతులు గుర్తించాలి

బొల్లాపల్లి: భూగర్భజలాల వృద్ధికి నీటికుంటలు ఎంతో ఉపయోగకరమని ఉపాధి హామీ ఏపీవో జీఎస్ ఆంజనేయరాజు తెలిపారు. మండలంలో అధికంగా మెట్ట ప్రాంతం ఉన్న సాగునీరు ఇబ్బందులు తొలగాలంటే పొలాల్లో బోర్ల సమీపంలో రైతులు నీటికుంటల ఆవశ్యకతను గుర్తించాలని చెప్పారు. వీటి వలన భూగర్భజలాలు వృద్ధి చెందుతాయని సాగునీటికి ఇబ్బందులు ఉండవని అన్నారు. చిన్న,సన్నకారు రైతులను నీటి కుంటల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఐదు ఎకరాల లోపు రైతులు తమ పొలాల్లో ఫారంపాండ్స్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.50వేలు నుంచి రూ. 1.50 లక్షల వరకు ఉచితంగా అందజేస్తుందన్నారు. రైతులు తమ పొలాల్లో 2 మీటర్ల లోతు, 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో లేదా 20 మీటర్ల వెడల్పు, 20 మీటర్ల పొడవుతో నీటి కుంటలు ఏర్పాటు చేసుకునే ఆవశ్యకతను ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వం కల్పిస్తుందని రైతులు సద్వినియోపరచుకోవాలని ఏపీవో తెలిపారు.

వినుకొండలో నేడు రెండు సమావేశాలు

వినుకొండ (నూజెండ్ల): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ డాక్టర్ దస్తగిరి తెలిపారు. ఈ సమావేశంలో నరసరావుపేట రోడ్డులోని మున్సిపల్ ఖాళీ స్థలంలో గుడ్‌విల్ పద్ధతిపై కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణం, షాపుల కేటాయింపు, వివిధ ప్రదేశాల్లో బ్యూటిఫికేషన్, జగనన్న కాలనీలకు నీటిసరఫరా కోసం, వార్డుల్లోని కోతులు, కుక్కలను పట్టివేత మొత్తం నాలుగు అంశాలపై చర్చించనున్నట్లు ఆయన వివరించారు. కావున సమావేశానికి వైస్ చైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొనాలని సూచించారు.

మండల సమావేశం కూడా....

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వినుకొండ మండల సర్వసభ్య సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మంగపురనాథ్ తెలిపారు. సాయంత్రం 2 గంటలకు జరిగే ఈ సర్వసభ్య సమావేశంలో అన్ని శాఖల పనితీరు, అభివృద్ధి పనులపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండల ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.